

నకిలీల హవా
అలంపూర్ ఆలయాల్లో అసలు ఉద్యోగుల కంటే నకిలీలే హవా నడిపిస్తున్నారు.

వివరాలు 8లో ▸



ఓబీసీలకు చేసిందేమిలేదు
దేశంలో ఓబీసీలకు ప్రధాని నరేంద్రమోదీ చేసిందేమిలేదని హన్మంతరావు అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.3 /22.5

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

11 నుంచి సదరం క్యాంపులు
పాలమూరు: ఈ నెల 11 నుంచి 26 వరకు జిల్లా జనరల్ ఆస్పత్రిలో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఓ యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11, 12న, 18న, 19న, 25న 26 తేదీలలో ఆస్పత్రిలో క్యాంపులు ఉంటాయని, అర్హులైన వారు హాజరుకావాలని సూచించారు. కొత్తగా సదరం సర్టిఫికెట్ తీసుకునే వారితో పాటు రెన్యువల్ చేసుకునే వారికి సైతం అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

వేరుశనగ @ రూ.7,390
జడ్చర్ల: బాదేపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వేరుశనగ క్వింటాల్‌కు రూ.7,390 ధర లభించింది. అలాగే మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,151, కనిష్టంగా రూ.2,090, పత్తి రూ.5,850, ఆర్‌ఎన్‌ఆర్ రకం గరిష్టంగా రూ.2,121, కనిష్టంగా రూ.2,091 చొప్పున పలికాయి.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నూతన పెన్షన్ విధానం ద్వారా ఉద్యోగులకు తీవ్రనష్టం జరుగుతుందని తక్షణమే దానిని రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేసేందుకు ఐక్య ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని పలు సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. శనివారం జిల్లాకేంద్రంలోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఈ నెల 23న ఓపీఎస్ విధానంపై నిర్వహించనున్న సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్ని వినతులు ఇచ్చినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ నెల 23 హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సదస్సుకు పెద్దఎత్తున ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సన్నాహక కార్యక్రమంగా జిల్లాకేంద్రంలో ఈ నెల 13న సెమినార్ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు జానకిరామయ్య, రవికుమార్, వెంకటేష్, ఆదిత్య, వెంకటేశ్వర్లు, రాజేశ్వర్, సత్యనారాయణ, రవికుమార్, వీరేష్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె



మహబూబ్‌నగర్ రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ అన్నారు. మహబూబ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెకు శనివారం ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ కార్మికులను రెగ్యులరైజ్ చేసి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులు సంపూర్ణంగా, స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొంటున్నారని, జిల్లాలో కొందరు సర్పంచ్‌లు, కార్యదర్శులు సమ్మెను విరమించుకోవాలని వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. కార్మికులు సమైక్యంగా సమ్మెలో ఉంటున్నారని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు రాములు పాల్గొన్నారు.

విజయవర్ధినికి పునరుజ్జీవం

బీచుపల్లి ఆయిల్‌మిల్లు పునఃప్రారంభానికి చర్యలు
- దశల వారీగా పరిశ్రమను వినియోగంలోకి తెచ్చేందుకు కృషి
- ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయిల్‌పాం సాగుపై రైతులకు ప్రోత్సాహం
- ఈనెల నుంచే మిషనరీ ఏర్పాటు చేసేందుకు అధికారుల సన్నాహాలు
- ఏడాదిన్నరలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం

స్థానిక రైతాంగానికి ఆర్థిక తోడ్పాటునందించి.. రెండు దశాబ్దాల పాటు వేలాది మందికి ఉపాధి కల్పించింది.. ఈ క్రమంలో కొందరు అధికారుల చేతివాటంతో అప్పుల ఊబిలోకి వెళ్లిపోయి మూతబడిన విజయవర్ధిని ఆయిల్ మిల్లు పునఃప్రారంభానికి అడుగులు పడుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ, ఆయిల్‌ఫెడ్ సంస్థ చొరవతో ఈ నెలలోనే మిషనరీ ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వేగంగా చర్యలు చేపట్టారు.

– మహబూబ్‌నగర్ డెస్క్

బీచుపల్లి విజయ వర్ధిని ఆయిల్ 1990లో ప్రారంభించారు. ఇటిక్యాల మండలం తిమ్మాపూర్ శివారు లో దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో.. దాదాపు రూ.18 కోట్ల వ్యయంతో ఆయిల్ మిల్లును ఏర్పాటు చేశారు. నూనెగింజల సాగులో రైతులను మరింత ప్రోత్సహించడానికి, తక్కువ ధరకే ప్రజలకు నూనె అందించడానికి 1983లోనే ఈ పరిశ్రమ నిర్మాణానికి బీజాలు పడ్డాయి. చివరికి ఏడేళ్ల నిరీక్షణ తర్వాత ఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభించారు. జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ సహకారంతో 200 టన్నుల సామర్థ్యం గల నూనెమిల్లు, 100 టన్నుల సామర్థ్యం గల సాల్వెంట్ ఆయిల్, 100 టన్నుల సామర్థ్యం గల రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం విజయ బ్రాండ్ నూనెలను ఉత్పత్తి చేసి వచ్చే ఆదాయంలో రైతులకు వాటా ఇచ్చే ఉద్దేశంతోపాటు వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడం కోసం దీన్ని ప్రారంభించింది. ఈ మిల్లు పరిధిలో గద్వాల, వనపర్తి, అలంపూర్, ఆత్మకూరు, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌తోపాటు నల్లగొండ, కర్నూలు జిల్లాల్లో నూనె గింజలను సేకరించి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు నిర్ణయించారు. అప్పట్లోనే ఈ మిల్లులో ప్రత్యక్షంగా 1,400 మంది పనిచేయగా.. పరోక్షంగా మరో 2వేల మంది ఉపాధి పొందారు.



బీచుపల్లి సమీపంలోని తిమ్మాపూర్‌లో ఏర్పాటు చేసిన విజయవర్ధిని ఆయిల్ మిల్లు

20 ఏళ్లకే మూత..
రెండు దశాబ్దాలపాటు విజయవంతంగా కొనసాగిన బీచుపల్లి విజయవర్ధిని ఆయిల్ మిల్లు 2003వ సంవత్సరంలో మూతబడింది. మిల్లులో ఉత్పత్తి చేసిన నూనె, ఇతర పదార్థాల అమ్మకాల్లో అధికారుల చేతివాటం, అక్రమాలు తోడై అప్పుల ఊబిలోకి వెళ్లింది. అప్పులను తీర్చి మళ్లీ ప్రారంభించేందుకు ఎన్‌డీడీబీ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు) ఆర్థిక సహకారం అందించినప్పటికీ అక్రమాలు కొనసాగాయి. ఫలితంగా ఎన్‌డీడీబీ ఇచ్చిన ఆర్థిక సహాయం కూడా వృథా కావడంతో పరిశ్రమ నష్టాల్లోకి వెళ్లి 2003లో పూర్తిస్థాయిలో మూతబడింది.

సండే స్పెషల్



ఆయిల్ పాం తోటలు

మిషనరీ ఏర్పాటుకు చర్యలు
తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో బీచుపల్లి ఆయిల్ మిల్లును 2019 నవంబర్‌లో పునఃప్రారంభించి, పనులు చేపడుతున్నారు. అందులో భాగంగా ఆయిల్ మిల్లులో నాలుగు ఎకరాలలో 228 ఆయిల్‌పాం మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి 42 వారాల స్టేజీలో ఉన్నాయి. సాధారణంగా ఆయిల్‌పాం మొక్కలు 36 నెలలకు రాగానే పక్వానికి వచ్చిన ఆయిల్ గెలల కోత ప్రారంభిస్తారు. ఒక ఎకరాలో 10 నుంచి 12 టన్నులు దిగుబడి వస్తుంది. టన్ను ధర ప్రస్తుతం రూ.13,500గా ఉంది. మిల్లులో యంత్రాలు ప్రారంభమైతే ఒక గంటకు 30 టన్నుల ఆయిల్ గెలలు అవసరం. ఒకరోజుకు దాదాపు 720 టన్నుల ఆయిల్‌పాం గెలలు మిల్లుకు అందుబాటులో ఉండాలి. కాగా.. మిల్లులో మిషనరీ ఏర్పాటు కోసం ఈ నెలలోనే భూమిపూజ చేయనున్నట్లు సమాచారం. అయితే పూర్తిస్థాయిలో మిషనరీ ఏర్పాటు చేసేందుకు దాదాపు ఏడాదిన్నర సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం కోతకు వచ్చిన ఆయిల్ గెలలను ఎవరైనా రైతులు మిల్లుకు తీసుకువస్తే అధికారులు ఇక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో అశ్వారావుపేటకు తరలిస్తున్నారు.



దశల వారీగా అభివృద్ధి..
విజయవర్ధిని ఆయిల్ మిల్లును పునరుద్ధరించి.. దశల వారీగా అభివృద్ధి చేసేందుకు నాలుగేళ్ల క్రితం తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా ఆయిల్ మిల్లుకు సంబంధించి అప్పు రూ.26.03 కోట్లు ఉండగా.. ఆయిల్‌ఫెడ్ సంస్థ జాతీయ పాడి అభివృద్ధి సంస్థతో వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.8.44 కోట్లు చెల్లించి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 2019లో మిల్లులో పామాయిల్ మొక్కల ప్లాంటేషన్‌కు శ్రీకారం చుట్టారు. భవిష్యత్‌లో ఆయిల్‌పాం క్రాషింగ్ యూనిట్ ఏర్పాట్లుకు చర్యలు చేపట్టారు. ఆయిల్‌పాం సాగులో ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, అశ్వారావుపేట, అప్పారావుపేట, పశ్చిమ గోదావరి జిల్లా పేదవేగి ప్రాంతానికి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి స్థానిక రైతులను తీసుకెళ్లి.. ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా ఆయిల్‌పాం సాగును ప్రారంభించేలా అవగాహన కల్పించారు.



ఆయిల్ పాం గెలలు

■ కనీసం 10వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు ఉంటే మిషనరీ ఏర్పాటు చేసేందుకు వీలుంటుంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో గతేడాది 4,700 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలను సాగు చేయగా.. 2034–24లో 5,600 ఎకరాల్లో సాగు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వనపర్తి జిల్లాలో గతేడాది 3,003 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ ఏడాది 1,700 ఎకరాల్లో, నాగర్‌కర్నూల్ జిల్లాల గతేడాది 400 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ ఏడాది 1,200 ఎకరాల్లో సాగు చేశారు. నారాయణపేట జిల్లాలో గతేడాది 4,700 ఎకరాల్లో సాగుచేయగా.. ఈ ఏడాది 6 వేల ఎకరాల లక్ష్యం పెట్టుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 3వేల ఎకరాల్లో సాగు చేయగా.. వచ్చే ఐదేళ్లలో 25 వేల ఎకరాల్లో సాగు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

తక్కువ పెట్టుబడితో..


ఆయిల్‌పాం తోటలు ఈదురు గాలులు, భారీ వర్షాలను తట్టుకొని నిలబడ్డాయి. పంటకు కూడా ఎలాంటి హాని జరగలేదు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లదు. దీనిని సాగు చేయడం వల్ల రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. సాధారణ వ్యవసాయంలో చీడపీడల బాధ అధికంగా ఉండేది. కానీ, ఆయిల్‌పాం తోట సాగుతో చీడపీడల బెడద కూడా తగ్గింది.

– చిన్నారెడ్డి, రైతు, మునుగాల, ఇటిక్యాల మండలం

సాగుకు సహకారం..


ఆయిల్‌పాం తోటల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద మొత్తంలో ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. మొక్కల కొనుగోలు నుంచి ఎరువుల దాకా ప్రతి దశలో కూడా ప్రభుత్వాలు సబ్సిడీ అందిస్తున్నాయి. మొదటి నాలుగేళ్లలో కేంద్రం నుంచి రూ.2.70 లక్షల దాకా సబ్సిడీ అందుతుంది. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా డ్రిప్ సిస్టం అందించింది.

– సత్యనారాయణ, రైతు, ఉప్పల, అయిజ మండలం

యువతకు ఉపాధి


మా పంచాయతీ పరిధిలోని కొండపేట, యాక్తాపురం, బీచుపల్లి గ్రామాల్లో ఎంతో మంది నిరుద్యోగులు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయిల్ మిల్లు ప్రారంభమైతే ఎంతో మంది యువతకు ఉపాధి దొరుకుతుంది. అలాగే ఆయిల్‌పాం తోటలు, వేరుశనగ పంటలను పండించే రైతులకు కూడా గిట్టుబాటు ధర లభిస్తుంది. దీనివల్ల చుట్టు పక్కల ప్రాంతాల రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

– నర్సమ్మ, సర్పంచ్, బీచుపల్లి

త్వరలోనే మిల్లు పునరుద్ధరణ..


జిల్లాలో 2019 నుంచి రైతులు ఆయిల్‌పాం తోటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 4,700 ఎకరాల్లో సాగవుతుంది. అక్కడక్కడ గెలలు కోతకు వస్తున్నాయి. త్వరలోనే వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిచే ఆయిల్ మిల్లును పునరుద్ధరించనున్నాం. పనులు ప్రారంభమైతే ఏడాదిలోగా పూర్తిస్థాయిలో మిషనరీ ఏర్పాటు చేసి రైతులకు మిల్లును అందుబాటులోకి తీసుకువస్తాం.

– వెంకటేష్, ఆయిల్ మిల్లు డిప్యూటీ మేనేజర్

ప్రతి కేసును సీసీటీఎన్‌ఎస్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలోని 16 పోలీస్ స్టేషన్లలో ప్రతి రికార్డును క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్కింగ్ సిస్టం (సీసీటీఎన్‌ఎస్)లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఎస్పీ కె.నరసింహ అన్నారు. వీటి బాధ్యతలను సిబ్బంది సక్రమంగా చేస్తున్నారా.. లేదా అనే విషయాన్ని ఆయా స్టేషన్ అధికారి పర్యవేక్షించాలన్నారు. ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని సీఐలు, ఎస్‌ఐలతోపాటు ఇతర సిబ్బందితో శనివారం నిర్వహించిన గూగుల్ మీట్ సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. నేరాలకు సంబంధించి నిత్యం అప్‌డేట్ ఉండాలని సూచించారు. ఇలా చే యడం వల్ల జిల్లా పోలీస్ శాఖ సమాచారం పూర్తిగా డిజిటలైజేషన్ అవుతుందన్నారు.

బాధ్యతగా పని చేయాలి

పలు నేరాల్లో నేరస్తులకు శిక్ష ఖరారు చేయడంలో కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు బాధ్యతగా పనిచేసి శిక్షల నుంచి ఎవరూ తప్పించుకోకుండా చూడాలని ఎస్పీ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం కోర్టు లైజన్ ఆఫీసర్స్, కోర్టు డ్యూటీ ఆఫీసర్లతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. కోర్టు వారెంట్స్, సమన్స్, ఎంసీఎస్ వర్టికల్స్‌పై స్టేషన్‌లలో పనిచేస్తున్న కోర్టు కానిస్టేబుళ్లు, అధికారులు విధుల్లో భాగంగా నాన్ బెయిలబుల్ వారెంట్‌లను క్రమం తప్పకుండా అమలు చేయాలన్నారు. కన్విక్షన్ రేటును పెంచాలని, కోర్టులో సరైన సమయంలో ఎఫ్‌ఐఆర్‌లను అందించడంతోపాటు ప్రాపర్టీను సైతం కోర్టులో డిపాజిట్ చేయాలని సూచించారు. కోర్టులో ట్రయల్ జరిగిన కేసుల వివరాలను స్టేషన్‌లో నమోదు చేస్తే పెండింగ్ లేకుండా ఉంటుందన్నారు. ఆయా సమావేశాల్లో ఏఎస్పీ రాములు, డీఎస్పీలు మహేష్, వెంకటరమణారెడ్డి, సీఐ బషీర్, ఐటీ ఇన్‌చార్జ్ ఆర్‌ఎస్‌ఐ రవి, కోర్టు లైజనింగ్ అధికారులు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ మాకొద్దు..



హన్వాడ మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం పంచాయతీ కార్మికుల డిమాండ్
- ఇప్పటికే విధులు బహిష్కరించి సమ్మెలోకి..
- పల్లెల్లో పారిశుద్ధ్య పనులపై తీవ్ర ప్రభావం
- జిల్లాలో 441 గ్రామ పంచాయతీలు, 1,453 మంది మల్టీపర్పస్ వర్కర్లు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీ పాలనపై మల్టీపర్పస్ కార్మికుల సమ్మె తీవ్ర ప్రభావం చూపుతోంది. పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీ పర్పస్ కార్మికులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం పోరుబాట పట్టారు. మల్టీపర్పస్ విధానం అమలుతో పనిభారం పెరగడమే కాకుండా చాలీచాలని వేతనాలతో కాలం గడపాల్సి వస్తుందని, నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలను పోషించలేకపోతున్నామని, ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్లతో గురువారం నుంచి సమ్మెకు దిగారు. కార్మికులు గ్రామాల్లో పనులు ఆపేసి సమ్మె బాట పట్టడంతో గ్రామీణ పాలనపై తీవ్ర ప్రభావం పడే అవకాశముంది. గ్రామ పంచాయతీల్లో మల్టీ పర్పస్ విధానంతో జనాభాకు అనుగుణంగా కార్మికులు పనిచేస్తున్నారు. మల్టీ పర్పస్ విధానంలో నియమించుకోవడంతో అన్నిరకాల పనులు చేయించడం, సకాలంతో జీతాలు చెల్లించకపోవడం, చాలీచాలని వేతనాలు ఇవ్వడం కార్మికులను సమ్మె వైపు నడిపింది. మల్టీపర్పస్ కార్మికులకు మొదట రూ.8,500 ఇచ్చేవారు. రెండు నెలల క్రితం రూ.వెయ్యి పెంచగా వేతనం రూ.9,500లకు చేరింది. జనాభాకు అనుగుణంగా నియమించుకున్న మల్టీపర్పస్ కార్మికుల వేతనాల నుండి స్థానిక అవసరాలను బట్టి నియమించుకున్న వారికి సైతం వేతన డబ్బులు పంచడం వంటి చర్యలతో కార్మికుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడం లేదు. కార్మికుల కడుపు నింపని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్‌తోపాటు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు సమ్మెకు దిగడం గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు, చెత్త తరలింపు, ట్రాక్టర్ నిర్వహణ, వీధి లైట్లు, ఇతరత్రా పనులు నిలిచిపోతున్నాయి. జిల్లా పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు ఇప్పటికే ఐదు నెలల వేతనాలు రావాల్సి ఉంది.

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లా పరిధిలో 441 గ్రామ పంచాయతీలు ఉండగా.. సుమారు 1,453 మంది మల్టీపర్పస్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.9,500, కార్మికులకు పంచాయతీ స్థానిక వనరులను బట్టి నెలకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వేతనంగా చెల్లిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ మెన్‌లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్‌లు గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. చిన్న పంచాయతీల్లో గరిష్టంగా ఇద్దరు, పెద్ద పంచాయతీల్లో 25 మంది వరకు పని చేస్తున్నారు. గతంలో వీరికి ఎస్‌ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘాల నిధుల నుంచి వేతనాలు చెల్లించేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌ఎఫ్‌సీ నిధులు నిర్ణీత వ్యవధిలో మంజూరు చేయడం లేదు. బిల్లులు ఎస్టీఓలో నిలిచిపోవడం, నెలలుగా పెండింగ్‌లో ఉండటం ఇబ్బందులకు దారితీస్తోంది.

డిమాండ్లు ఇవి..
- ■ గ్రామాల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేయాలి.
- ■ పీఆర్సీ నిర్ణయించిన మినిమం బేసిక్‌ను వేతనంగా చెల్లించాలి. జీఓ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, బిల్ కలెక్టర్లు, కారోబార్‌లకు రూ.19,500 చెల్లించాలి.
- ■ పంచాయతీ కార్మికుల వేతనాల కోసం ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలి.
- ■ 2011 జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రస్తుత అవసరాల ప్రకారం కార్మికుల సంఖ్య పెంచాలి.
- ■ ప్రతినెలా రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలి.
- ■ జీఓ 51ను సవరించాలి. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి.
- ■ ప్రతి కార్మికునికి ప్రమాద బీమా రూ.10 లక్షలు, దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలి.
- ■ రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.5 లక్షలు చెల్లించాలి.
- ■ ఏడాదికి మూడు జతల యూనిఫాంలు, చెప్పులు, సబ్బులు, నూనెలు, నగదు రూపంలో అలవెన్సులు ఇవ్వాలి.
- ■ పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా కల్పించాలి. 8 గంటల పనిదినాన్ని అమలు చేయాలి.
- ■ కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలి. రాజకీయ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి.

ఎవరికి చెప్పుకోవాలి..


గ్రామాల్లో మమ్మల్ని వివిధ రకాల పనులకు ఉపయోగిస్తున్నారు. ఇచ్చిన జీతాల్లో అదనంగా పెట్టుకున్న వారికి పంచుతున్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి. కనీస వేతనాలు అమలు చేసే వరకు మా పోరాటం ఆగదు. జీతాలకు చాలా గ్రామాల్లో డబ్బులు లేవంటున్నారు. ఇంతకాలం క్రమం తప్పకుండా జీతాలు ఇచ్చి ఇప్పుడిలా చేస్తే మా పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలి. కొన్నిచోట్ల మూడు నెలలుగా జీతం రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

– బాలు, మల్టీపర్పస్ వర్కర్

నెలాఖరులోగా సస్పెన్షన్ బ్రిడ్జి ప్రారంభం

- శిల్పారామంలో అతిపెద్ద జాయింట్ వీల్, థీమ్ పార్కు ఏర్పాటుకు కృషి
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సస్పెన్షన్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని పెద్ద చెరువు వద్ద మినీ ట్యాంకుబండ్‌లో నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జిని నెలాఖరులోగా ప్రారంభిస్తామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అక్కడ కొనసాగుతున్న పనులను శనివారం సాయంత్రం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అలాగే శిల్పారామం వద్ద ఏర్పాటు చేయనున్న అతిపెద్ద జాయింట్ వీల్, థీమ్ పార్కుకు సంబంధించిన నిర్మాణాలపై కన్సల్టెంట్లతో చర్చించారు. దక్షిణ కొరియా, సింగపూర్ వంటి దేశాల్లో ఉన్న థీమ్ పార్కుల నమూనా ఛాయాచిత్రాలు, వీడియోలను తిలకించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో పెద్దఎత్తున పర్యాటక పనులను చేపడుతున్నామన్నారు. ఇటీవల వారం రోజులపాటు దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా తిలకించిన పర్యాటక సౌకర్యాలను శిల్పారామం, మినీ ట్యాంక్‌బండ్‌లో ఇంకా అధునాతన పద్ధతిలో కల్పిస్తామన్నారు.

సుందరంగా తీర్చిదిద్దుతాం

పాలమూరు పట్టణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దక్షిణ కొరియాలో ఉన్న ప్రఖ్యాత వార్ మెమోరియల్‌ను పోలిన కళాఖండాలు, ఫిరంగులు, యుద్ధట్యాంకులు, మిస్సైళ్లు, హెలీక్యాప్టర్లను మినీ ట్యాంక్ బండ్‌పై వరుసగా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లాకేంద్రంలో ఇండోర్ స్టేడియం పూర్తయినందున త్వరలోనే జాతీయస్థాయి క్రీడలను నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, పర్యాటక శాఖ ఎండీ మనోహర్ ఉన్నారు.

క్లుప్తంగా

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య


జలంధర్ (ఫైల్)

ఆత్మకూర్: తండ్రి మందలించడంతో కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన తూంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని తూంపల్లి గ్రామానికి చెందిన చాకలి రాములుకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. రెండో కుమారుడు జలంధర్(26) ఏ పని చేయకుండా తిరుగుతుండేవాడు. మద్యానికి అలవాటుపడ్డాడు. ఈనేపథ్యంలో కుమారుడికి సంబంధాలు రావడంలేదని, ఏదైనా పని చేసుకోవాలని తండ్రి కుమారుడిని మందలించాడు. దీంతో జలంధర్ గురువారం ఉదయం ఇంట్లోంచి వెళ్లిపోయాడు. రాత్రి తిరిగి రాకపోవడంతో వెతికారు. ఎంతకూ ఆచూకి లభించలేదు. శుక్రవారం మధ్యాహ్నం గొర్రెల కాపరులు గ్రామశివారులో ఓ చెట్టుకు ఉరేసుకున్న విషయం గమనించి సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వారు అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడింది జలంధర్‌గా గుర్తించారు. పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

బాలానగర్: ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం... బాలానగర్ మండలంలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన అమృత (55) శుక్రవారం కట్టెలు(వంట చెరుకు) తీసుకురావడానికి సమీప పొలాలకు, గైరాన్ భూమిలోకి వెళ్లింది. కట్టెలు తెచ్చి రాత్రికి భోజనం చేసి పడుకుంది. అర్ధరాత్రి ఆమె నోటి నుంచి నురుగ రావడాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. వెంటనే చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటనపై ఆమె కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆస్పత్రి ఖర్చులు భరించలేక ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: అనారోగ్య సమస్యల కారణంగా ఆస్పత్రి అయ్యే ఖర్చులకు ఇబ్బందులు ఏర్పడడంతో భార్యభర్తలు గొడవపడి భార్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మర్లుకు చెందిన తీగల కళమ్మ(45) పట్టణంలోని ఎస్‌వీఎస్ డెంటల్ కళాశాల వెనుక భాగంలో శనివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు కొన్ని రోజుల నుంచి ఫిట్స్‌తో పాటు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంది. ఈ క్రమంలో ఆస్పత్రికి వెళ్లడానికి అయ్యే ఖర్చు విషయంలో దంపతులు గొడవపడటంతో ఆమె మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెల్లడించారు.

పెళ్లి కావడం లేదని.. యువకుడి బలవన్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: పెళ్లి కావడం లేదని.. మద్యానికి బానిసైన ఓ యువకుడు రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ టి.కృష్ణ కథనం ప్రకారం.. మహమ్మదాబాద్‌కు చెందిన బండి గణేష్(35)కు తల్లిదండ్రులు లేకపోవడంతో కొన్ని రోజులపాటు ముంబాయిలో కూలీ పనులు చేసుకుని జీవనం సాగించాడు. ఇటీవలే మహబూబ్‌నగర్‌కు వచ్చి ఏనుగొండలో ఓ రూం అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు లేకపోవడంతోపాటు పెళ్లి కావడం లేదని తాగుడుకు బానిసయ్యాడు. దీంతో ఒంటరితనం భరించలేక జీవితంపై విరక్తి చెంది శనివారం జిల్లాకేంద్రంలోని ఏనుగొండ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

యువకుల ఘర్షణ: పోలీసులకు ఫిర్యాదు

ధరూరు: సందెపురాళ్ల ఎత్తే క్రమంలో గొడవ జరిగిన ఘటన మండలంలోని భీంపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన హరిజన హనుమంతు జూన్ 23న సాయంత్రం గ్రామంలోని కూడలి వద్ద సందెపు రాళ్లు ఎత్తుతుండగా, అదే గ్రామానికి చెందిన వి.ఆంజనేయులు, ఎం. ఆంజనేయులు దాడికి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. తనను దూషించి దాడి చేశారని శనివారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిందితులపై కేసు నమోదు

బల్మూర్: మండలంలోని మైలారం శివాలయం వద్ద శుక్రవారం గుప్తనిధుల కోసం యంత్రంతో అన్వేషిస్తూ పట్టుబడ్డ నిందితులపై గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు శనివారం కేసునమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రేణయ్య తెలిపారు. మండలంలోని జినుకుంట గ్రామానికి చెందిన పరశురాములు, ఐలయ్య, మైలారం గ్రామానికి చెందిన నర్సింహ్మారెడ్డి యంత్రంతో శివాలయం సమీపంలో అన్వేషిస్తుండగా గమనించిన గ్రామస్తులు, సర్పంచ్ వారిని పట్టుకొని తమకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. వీరిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో నకిలీల హవా

- ఆలయంలో అసలు ఉద్యోగుల కంటే వీరిదే ఎక్కువ హడావుడి
- అందుబాటులో ఉండని టూరిజం గైడ్
- ఇష్టానుసారంగా ప్రైవేట్ వ్యక్తుల నియామకం
- యాత్రికులకు తెలియని ఆలయ విశేషాలు


ఆలయంలో రాచమార్గాన టికెట్లు లేకుండా తమ వారిని లోపలికి తీసుకెళ్తున్న టూరిజం గైడ్

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో అసలు ఉద్యోగులకు బదులు నకిలీలే హవా నడిపిస్తున్నారు. అందులోనూ ఆలయానికి వచ్చే వీఐపీలకు మాత్రమే వారి సేవలు అందుతున్నాయి. అలంపూర్ పర్యాటక కేంద్రం కావడంతో ఇటు భక్తులకు, అటు యాత్రికులకు ఆలయ విశేషాలు చెప్పేందుకు పదేళ్ల క్రితం గైడ్‌ను ఏర్పాటు చేశారు. అయితే రెగ్యులర్ ఉద్యోగులు అనారోగ్యం పేరుతో తమకు సంబంధించిన కొత్త వ్యక్తులను సేవలందించేందుకు ఆలయానికి పంపుతున్నారు. వీరు మాత్రం వీఐపీలకు ప్రత్యేక దర్శనం చేయిస్తూ తమ జేబులు నింపుకోవడానికి పనిచేస్తున్నారు. గైడ్ పేరిట టూరిజం ద్వారా జీతాలు పొందుతూ.. సేవలు మాత్రం వీఐపీలకు అందిస్తుండటం విశేషం.

యాత్రికులకు చేరని ఆలయ విశేషాలు..

అలంపూర్ క్షేత్రం గొప్పతనం యూట్యూబ్, ఇంటర్నెట్‌ల ద్వారా తెలుసుకుని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు, యాత్రికులకు టూరిజం గైడ్ అందుబాటులో ఉండటం లేదు. ఆశగా వచ్చిన యాత్రికులకు ఆలయ చరిత్ర తెలియక నిరాశతో వెనుదిరుగుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

ఆలయంలో పనిచేసే సిబ్బందిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆలయ ఉద్యోగుల విధి నిర్వహణ గాడి తప్పింది. ఆలయంలో ఏ ఉద్యోగి ఏం పని చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అక్రమార్జనకు అలవాటు పడిన కొందరు ఆలయ ఉద్యోగులు ఏ రూపంలో ఆదాయం వస్తుందో.. ఆ పనులు మాత్రమే ఎంపిక చేసుకుని అక్కడే విధులు నిర్వహిస్తున్నారు.

టూరిజం గైడ్‌ను పంపించాం..

ఆలయంలో టూరిజం గైడ్ విధి నిర్వహణ గురించి తెలుసుకొని దేవస్థానం కార్యాలయంలోకి రావొద్దని చెప్పాం. గైడ్ మాత్రమే బయట చెప్పుకోవాలి. ఆలయంలో ఇకపై భక్తులు, యాత్రికులు టికెట్లు తీసుకోకుండా లోపలికి తీసుకురావొద్దు. టికెట్ లేకుండా దర్శనం చేయిస్తే చర్యలు తీసుకుంటాం. – రంగనాథ్, ఆలయ సీనియర్ అసిస్టెంట్

ఓబీసీలకు మోదీ చేసిందేమిలేదు


మాట్లాడుతున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతురావు

- వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీల ఓటమి ఖాయం
- పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతురావు

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో ఓబీసీలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిందేమిలేదని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్ అధ్యక్షతన శనివారం జిల్లా ఓబీసీ ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడారు. కర్ణాటకలో బీసీలు, మైనార్టీలు ఓట్లు వేస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కులాల వారీగా సర్వే చేసి ఇప్పటి వరకు ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. టీఆర్‌ఎస్ నుంచి బీఆర్‌ఎస్‌గా మారినప్పుడే ఇక్కడి ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. దేశంలో కాంగ్రెస్ హవా కొనసాగుతుందన్నారు. రాహుల్‌గాంధీకి ప్రజల్లో అపూర్వ ఆదరణ లభిస్తుందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలు ఓటమి చవి చూడటం ఖాయమన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశిస్తున్నారని జోష్యం చెప్పారు. లక్షలాది మందితో బీసీల గర్జన విజయవంతంగా నిర్వహించి.. మన వాటా కోసం హైకమాండ్ ముందు ఉంచుదామన్నారు. జాతీయ కాంగ్రెస్ ఓబీసీ నాయకుడు కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ 2004లో బీసీ గర్జన జరిగిందని, దాని ప్రభావంతో అప్పట్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు కూడా అదేస్థాయిలో బీసీ గర్జన విజయవంతంగా నిర్వహించుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, ఎర్ర శేఖర్, ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, నాయకులు శంకర్‌ప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, బెక్కరి అనిత, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన టికెట్లు కేటాయించాలి..

వచ్చే ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన టికెట్లు కేటాయించాలని పలువురు కాంగ్రెస్ బీసీ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పార్టీలో ఉండి పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్నప్పటికీ సరైన గుర్తింపునకు నోచుకోవడం లేదన్నారు. కొత్తగా పార్టీలో చేరేవారికి టికెట్ల హామీలు ఇవ్వవద్దని కోరారు. దేవరకద్రకు చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం నుంచి పనిచేస్తున్నా సరైన గుర్తింపు రాలేదన్నారు. 1999 నుంచి 2018 ఎన్నికల వరకు టికెట్ అడిగితే ఇవ్వలేదన్నారు. మూడు రోజుల క్రితం వచ్చిన వారికి జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చారని, 30 ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమలాంటి వారిని పట్టించుకోలేదన్నారు. ఎందుకు బీసీ నాయకుల పట్ల వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లాపూర్‌కు చెందిన మహిళా నాయకురాలు మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎవరైనా రావొచ్చని, వచ్చిన రెండు నెలలకే టికెట్ కావాలంటే సాధ్యం కాదని, ఐదేళ్లు పార్టీ కోసం పనిచేసిన తర్వాతనే ఆలోచించాలని హితవు పలికారు.

చెడు మార్గం వైపు.. నేటి యువతరం



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రొఫెసర్ హరగోపాల్

- ప్రొఫెసర్ హరగోపాల్

అచ్చంపేట రూరల్: గత చరిత్ర సత్యాలను రేపటి తరానికి తెలియకుండా పాలకులు చేస్తున్న కుట్రల వల్ల నేటి యువతరం చరిత్రను మరిచి చెడు మార్గం వైపు అడుగులు వేస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. శనివారం అచ్చంపేటలోని ఫంక్షన్ హాల్లో ఆ ప్రాంతానికి చెందిన రచయిత చెవ్వ రఘుపతి రాసిన 'కాలం మరువని యోధులు' అనే వ్యాస పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ ప్రజల కోసం పోరాడుతున్న, నిలబడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతూ కేసులు పెట్టి అణచేసే ధోరణి అవలంబిస్తోందన్నారు. పాలకులు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టి ప్రతి ఒక్కరూ ప్రజా ఉద్యమాల వైపు నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఆదివాసీలు వారి బతుకుదెరువు కోసం ఐదు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారన్నారు. నల్లమలలో చెంచు, ఆదివాసి గిరిజనులు సంస్కృతి సాంప్రదాయంతో జీవించే హక్కును పాలకులు కల్పించాలన్నారు. దేశంలో జరుగుతున్న విభిన్నకర వాస్తవ పరిస్థితులను తన వ్యాసాల ద్వారా వివరిస్తున్న దళిత జర్నలిస్టు సుజాతపై జరుగుతున్న దాడి ద్వారా వివక్ష, వ్యతిరేక పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి పరిస్థితుల్లో రచయిత రఘుపతి రాసిన 12 వ్యాసాలు ఆనాటి ఉద్యమ పరిస్థితులు, బడుగు, బలహీన వర్గాల ఔనత్యాన్ని చాటడం, నేటి తరానికి కావలసిన చరిత్ర సత్యాలను, వాటి లోతులను అధ్యయనం చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. అంతకు ముందు శాతవాహన విశ్వ విద్యాలయం సుజాత మాట్లాడారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక నాయకులు రాఘవాచారి, వెంకట్‌గౌడ్, సతీష్, నారాయణ, లక్ష్మీనారాయణ, పాండు, నాసరయ్య, గోపాల్, అనీల్ పాల్గొన్నారు.

జూరాలలో తగ్గుతున్న నీటిమట్టం



ధరూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఎలాంటి ఇన్‌ఫ్లో లేకపోవడంతో రోజురోజుకూ జలాశయంలో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. 20 రోజుల క్రితం వరకు 8 టీఎంసీల నీటితో కళకళలాడిన ప్రాజెక్టు.. తాగునీటి అవసరాలు, భీమా ఎత్తిపోతలు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయడంతో నీటిమట్టం తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి కేవలం 147 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చిందన్నారు. ఇదిలా ఉండగా ప్రాజెక్టు నుంచి భీమా లిఫ్టు–1కు 596 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 81 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు కలిపి మొత్తం 992 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.640 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

500 గ్రాముల గంజాయి సీజ్: ఇద్దరు అరెస్ట్

మహబూబ్‌నగర్ క్రైం: హైదరాబాద్ నుంచి గంజాయి తీసుకొచ్చి మహబూబ్‌నగర్‌లో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్టీఏ కార్యాలయ సమీపంలో శనివారం ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా.. అందులో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన బీసు హర్షవర్ధన్ రెడ్డి, బోయ మహేష్‌నాయుడు వద్ద 500 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. వీరు ఇద్దరూ హైదరాబాద్‌లోని దూళ్‌పేట ఏరియాలో గంజాయి కొనుగోలు చేసి, మహబూబ్‌నగర్‌లో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో సదరు ఇద్దరు వ్యక్తులను అర్బన్ తహసీల్దార్ పార్థసారధి ఎదుట హాజరు పరిచి, గంజాయి స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

కృష్ణానదిపై ఎత్తిపోతల పనులు ఆపాలి


కర్ణాటక నిర్మిస్తున్నా ఎత్తిపోతల పథకంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

- కర్ణాటక ప్రభుత్వం ఇష్టానుసారంగా నీటిని తోడుతోంది
- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

కృష్ణా: కృష్ణానదిపై కర్ణాటక ప్రభుత్వం కడుతున్నా ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే నిలిపేయాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కర్ణాటకలోని గంజిపల్లి గ్రామంలో కృష్ణానదిపై కడుతున్న ఎత్తిపోతల పథకం పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. గురువారం సాక్షిలో 'కృష్ణానదిపై మరో అడ్డుకట్ట' అనే శీర్షికతో వార్త రావడంతో స్పందించిన ఆయన ప్రాజెక్టు పనులు వెంటనే ఆపాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా నది జలాలను తీసుకెళ్లడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే కర్ణాటక సర్కార్ ఎక్కడికక్కడ నదులపై ఆనకట్టలు కట్టి నీటిని తీసుకెళ్తోందన్నారు. రాయచూర్ జిల్లాలోని 18 గ్రామాలకు సాగునీటిని అందించేందుకు అక్కడి ప్రభుత్వం 189 కోట్ల తో ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రారంభించిందన్నారు. ఎత్తిపోతలకు నాలుగు 1750హెచ్‌పీ మోటర్లను బిగించి నీటిని తోడేందుకు సిద్ధం చేస్తున్నారన్నారు. ఇప్పటికే పనులు 90 శాతం పూర్తి అయ్యాయని, బీజేపీ ఎక్కడికక్కడ కుతంత్రలు చేయడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ విషయంపై తాను ఉన్నతాధికారులను కలిసి తగు చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఆయన వెనుక పార్టీ నాయకులు మహిపాల్‌రెడ్డి, అశోక్‌గౌడ్ ఉన్నారు.

24గంటల్లో దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సైదులు


రికవరీ చేసిన బంగారం, స్మార్ట్ ఫోన్‌లు

- రూ.4లక్షల 58వేల విలువ చేసే బంగారం, స్మార్ట్ ఫోన్‌లు రికవరీ
- వివరాలు వెల్లడించిన వన్‌టౌన్ సీఐ సైదులు

మహబూబ్‌నగర్ క్రైం: ఓ ఇంట్లో చోరీ చేసిన దొంగను 24గంటల్లో వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి బంగారం ఇతర వస్తువులు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వన్‌టౌన్ సీఐ సైదులు వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్‌జిల్లా కేంద్రంలోని హనుమాన్‌పురకు చెందిన తస్మీన్ ఉన్నిసా బేగం ఈనెల 6న రాత్రి భోజనం చేసిన తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రపోయారు. ఈనెల 7న తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుక వైపు ఉన్న గది తాళం ధ్వంసం చేసి ఇంట్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం నల్లపూసల దండ, తులం బంగారం గాజు, ఒక తులం మ్యాట్నీలు, బంగారం ఉంగరాలు, చెవికమ్మలు, వెండి వస్తువులు, పది తులాల గొలుసులు, ఐదు స్మార్ట్ ఫోన్‌లు ఎత్తుకెళ్లారు. వీటి విలువ రూ.4లక్షల 58వేలు వరకు ఉంటుందని బాధితురాలు తస్మీన్ ఉన్నిసాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి దొంగను 24గంటల్లో అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. హనుమాన్‌పురకు చెందిన ఎండీ రషీద్ అలియాస్ నసీర్ అలియాస్ గుభా అనే ఆటో డ్రైవర్ దొంగతనం చేసినట్లు గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతని నుంచి రూ.4.58లక్షల విలువ చేసే బంగారం, వెండి వస్తువులు, ఐదు స్మార్ట్ ఫోన్లు రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు.

పోరాటాలతోనే యాదవ జాతి అభివృద్ధి



మహబూబ్‌నగర్ రూరల్: రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో యాదవుల వాటా కోసం ఉద్యమించాలనే లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న యాదవ సంఘాలన్నింటిని ఏకతాటిపైకి తీసుకొస్తామని తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలికాని వెంకట్‌యాదవ్ అన్నారు. శనివారం జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం భవనంలో జిల్లా అధ్యక్షుడు అంజన్నయాదవ్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాదవులు, యాదవ ఉప కులాలు తెలుగు నేలపైన 18 శాతం జనాభా ఉందని గణాంకాలు చెబుతున్నాయన్నారు. జనాభా దామాషా పద్ధతిలో రాజకీయ ప్రాతినిధ్యంలో, ఆర్థిక అవకాశాల్లో, విద్య, ఉద్యోగ, సాంస్కృతిక రంగాల్లో చాలా వెనుకబడి ఉన్నామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని పార్టీలు యాదవులు, యాదవ ఉప కులాలకు 22 ఎమ్మెల్యే, 7 ఎమ్మెల్సీ, 5 ఎంపీ సీట్లు ఇవ్వాలంటూ సమరశీల పోరాటాలు చేసి, యాదవ జాతి అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జనగణనలో కుల గణన వెంటనే చేపట్టాలని, యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రాష్ట్ర బడ్జెట్‌లో యాదవులకు 18 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 13న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి, యాదవ యుద్ధభేరిని ప్రకటిస్తామని తెలియజేశారు. అనంతరం యాదవ యుద్ధభేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘం చైర్మన్ శాంతన్న యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి వై.రవికుమార్ యాదవ్, సాయిలుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. వన్‌టౌన్ ఎస్‌ఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. టీడీగుట్ట బస్టాండ్ సమీపంలో శనివారం గుర్తు తెలియని పురుషుడు(45) మృతదేహం లభ్యమైంది. మృతుడి దగ్గర ఎలాంటి వివరాలు లేకపోవడంతో పాటు అనారోగ్యంతో మృతి చెందినట్లు అనుమానిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రి పోస్టుమార్టం విభాగానికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ వెనకబాటుకు వారే కారకులు

- ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్


బైక్ ర్యాలీలో డీఎస్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహారాజ్

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలంతా రెడ్లు, వెలమల పాలన కట్టుబాట్లను తెంచుకొని బయటకు రావాలని ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం వెనుకబాటుకు గురైంది వారి నుంచేఅని అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ధర్మసమాజ్ పార్టీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆవిర్భావ సభ నిర్వహించారు. అంతకు ముందు విశారదన్‌కు పార్టీ నాయకులు జడ్చర్ల నుంచి మహబూబ్‌నగర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. క్రిష్టియన్‌పల్లిలో ధర్మసమాజ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అక్కడి నుండి ఆవిర్భావ సభకు చేరుకుని మాట్లాడారు. రెడ్లు, వెలమలు రాజ్యాధికారాన్ని తమ చెప్పుచేతల్లో ఉంచుకొని బడుగు, బలహీన వర్గాల ప్రజలను పావులుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ బానిస సంకెళ్ల నుంచి బయటపడి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకునప్పుడే ఆత్మగౌరవం పెంపొందుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల నుంచి డీఎస్‌బీ అభ్యర్థులను బరిలో నిలుపుతుందని వెల్లడించారు.మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబాటుకు ఆంధ్ర పరిపాలకులు కారకులు కారని, జిల్లాలోని రెడ్లు, వెలమలే అందుకు కారణమని ఆరోపించారు. రెడ్డి వర్గం నాయకులతో రాజకీయం చేసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవాలనే తరుణంలో బీజేపీ అనూహ్యంగా కిషన్ రెడ్డికి పార్టీ రాష్ట్ర అధికార బాధ్యతలను ఇచ్చి తమ వైపునకు రెడ్డి వర్గాన్ని తిప్పుకోవాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వైఖరి ఇలా ఉండగా, బీఆర్‌ఎస్ వెలమలతో రాజకీయం చేస్తూ బడుగు, బలహీన వర్గాలను అణగదొక్కాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఈ తరుణంలోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకునేందుకు ముందుకు రావాలని కోరారు. సభలో సంజీవ్ ముదిరాజ్, పద్మశాలి నాయకుడు సారంగి లక్ష్మికాంత్, డీఎస్‌బీ రాష్ట్ర నాయకులు రాఘవేందర్, క్రిష్ణనాయక్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి శివన్, జిల్లా అధ్యక్షుడు రాములు, సంధ్యారాణి, ఎల్లయ్య, సూర్య, నరేష్, డేవిడ్, ఈశ్వర్, సాయి పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

■ మహబూబ్‌నగర్ శ్రీనగర్ కాలని హౌసింగ్ బోర్డ్ బస్ స్టాప్ దగ్గర 484 గజాల ఓపెన్ ప్లాటు అమ్మబడును. సంప్రదించండి వాసుదేవరెడ్డి సెల్: 9603765456.

SERVICES

BUSINESS OFFER

■ Forex Trading Low Investment high Returns your own account only copy2earn. 70:30 Profit Sharing. Contact: 9160284028.

HEALTH CARE

ORTHOPEDIC SURGEON

■ డా॥ యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శ్రీశ పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 – 228888, 83412 98888

GYNECOLOGY

■ కార్తీక్ హాస్పిటల్, నంద్యాల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, అన్ని రకాల స్త్రీ వ్యాధులు, జనరల్, బి.పి. షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజిషియన్, డా॥ పార్వతీ దేవి, M.D., DGO., స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్: 10-8PM, 08518-226162

WANTED

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.

■ VISA Consultation Overseas Blue & White Collar Jobs All Profiles Lucrative Salary Highpay. Interviews Vizag 9th to 11th July&Hyd. 13th&14th July. Ph: 9717618737

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, భార్యభర్తలు, డ్రైవర్స్ కావలెను. Ph: 9391036931, 9246585901

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ:18K. Ph: 9640258899, 9640468899

HAPPY BIRTHDAY
సాక్షి ద్వారా మీ ఆత్మీయులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని ... సాక్షి మేనేజర్